

సాంకేతిక నైపుణ్యాభివృద్ధిపై ఆన్‌లైన్‌లో శిక్షణ

ఎచ్చెర్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్‌ఎస్‌డీసీ, నాస్కామ్ ఆధ్వర్యంలో 'ఏఐ కార్యక్రమం- భవిష్యత్ ఆవిష్కర్తలకు సాధికారిత, డిజిటల్ 101 ప్రోగ్రాం'ను ప్రారంభించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్‌లు, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర ఆధునాతన సాంకేతికపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. డిజిటల్ 101 ప్రోగ్రాంకు ఫిబ్రవరి 2వ తేదీలోగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 99888 53335 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇదంతా స్మార్ట్‌ఫోన్ మాయ!







సాంకేతికత పెరుగుతున్న వేళ.. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్ వినియోగం వ్యసనంలా మారింది. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఎవరి చేతిలో చూసినా స్మార్ట్ ఫోన్ దర్శనమిస్తోంది. విద్యతోపాటు ఆర్థికపరమైన అంశాలు.. ఇతర ఏ సమాచారం కావాలన్నా.. దానిపైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థులు, యువత చదువులో వెనకబడిపోతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల కేంద్ర ప్రభుత్వ సంస్థ 'అసర్'.. చేసిన సర్వే ద్వారా స్పష్టమైంది.

- యూట్యూబ్ వీడియోలపైనే మోజు
- ప్రాథమిక పఠన స్థాయి అంతంతమాత్రమే
- అంక గణితంలోనూ ఆసక్తి లేదాయె
- ఇంగ్లీషు చదవడం కాస్త ఫర్వాలేదు
- ఆర్థిక విషయాలకూ ఫోన్‌పైనే ఆధారం
- జిల్లాలో 14-18ఏళ్ల లోపు యువత తీరిదీ
- 'అసర్' నివేదిక ద్వారా వెల్లడి

శ్రీకాకుళం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్‌లపై రోజురోజుకూ పెద్దలకే కాదు.. పిల్లలకు.. యువతకు మోజు పెరిగిపోతోంది. ప్రస్తుతం ఫోన్ లేకపోతే జీవితమే లేదన్నట్లుగా.. ప్రతి ఒక్కరి పరిస్థితి తయారైంది. భవిష్యత్‌ను గందరగోళంలో నెట్టేసే అంశం ఇది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ సంస్థ 'అసర్'(యాన్యువల్ స్టేటస్ ఎడ్యుకేషన్ రిపోర్ట్).. ఓ సర్వే చేసింది. దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాల్లోని 28 జిల్లాల్లో 1,664 గ్రామాల్లో 30,074 ఇళ్ల వద్దకు వెళ్లి.. 34,745 మంది యువత అభిప్రాయాలను సేకరించింది. మన జిల్లాలోని 60 గ్రామాల్లో 1,047 ఇళ్లకు వెళ్లి.. 1,108 మంది యువతకు సర్వే చేసింది. ఇందులో 14 నుంచి 18 ఏళ్లలోపు వయసున్నవారి విద్యా సమాచారం, గణితం, స్మార్ట్ ఫోన్ వినియోగం, ఇతరత్రా విషయాలపై ఆరా తీసింది. అధిక విషయాల కోసం యువత స్మార్ట్ ఫోన్‌కే మొగ్గు చూపడం, ఆర్థిక అంశాలకు ఫోన్‌పైనే ఆధారపడుతున్న విషయం సర్వే నివేదికలో వెల్లడైంది. అధికశాతం మంది (మిగతా 6వ పేజీలో..)

కీలక అంశాల్లో యువత సామర్థ్యం (శాతంలో)..

ఆర్థిక పరమైన అంశాలు	14-16 వయసు	17-18 వయసు
లెక్కల నిర్వహణలో	75.6	77.1
డిస్కౌంట్ విషయాలపై	37.3	37.4
చెల్లింపు విషయాలలో	10.4	12.4

స్మార్ట్ ఫోన్ వినియోగం ఇలా.. (శాతంలో)..

	14-16 వయసు	17-18 వయసు
సొంత మొబైల్..	22.2	56.1
సోషల్ మీడియా	96.4	94.3
ప్రొఫైల్ బ్లాక్/రిపోర్ట్	41.9	59.7
పాస్‌వర్డ్ మారుస్తున్నవారు	35.2	56.9
వారంలో విద్యకోసం...	78.9	75.6
ఆన్‌లైన్ సర్వీసులకు	29.8	54.3
ఎంటర్‌టైన్‌మెంట్ కోసం..	81.7	88.5
అలారం సెట్టింగ్‌కు	82.4	88.3
సమాచారం కోసం నెట్ సెర్చింగ్	74.6	82.3
గూగుల్ మ్యాప్ శోధన	41.0	58.6
యూట్యూబ్ వీడియోలు చూస్తూ..	80.0	91.3
వీడియోలు షేరింగ్	90.7	94.3
డిజిటల్ టాస్క్ కోసం..	65.2	79.0

'రథసప్తమి'కి రండి
- మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం
6 లో

కీలక అధికారులకు
బాధ్యతలు
- నేటి నుంచి ఫిబ్రవరి 5వరకు శ్రీకాకుళంలోనే విధులు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
7 లో

రైతుబజారుకు కార్యరూపమెప్పుడో!
- ప్రకటనలకే పరిమితం
- రోడ్డుపై వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం
- కొనుగోలుదారులకు, రైతులకు తప్పని ఇక్కట్లు
6 లో


పలాస-కాశీబుగ్గలో రోడ్డుపైనే కూరగాయల విక్రయం

ప్రజా భాగస్వామ్యంతోనే
కుష్ఠువ్యాధి నిర్మూలన
- డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ
7 లో


చదును చేసిన ఆదిత్యాలయం ఆవరణ

ఇక రెండు రోజులే!

- సకాలంలో పనులు పూర్తయ్యేనా?
- రథసప్తమికి సమీపిస్తున్న గడువు
- ఇంకా ఖరారు కాని క్యూలైన్ల ఏర్పాట్లు
- సీసీ కెమెరాలపైనా స్పష్టత కరువు
- అయోమయంలో ఆలయ అధికారులు

అరసవల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుక ఏర్పాట్ల పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఈ సారి రథసప్తమిని రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో వేడుకలను వైభవంగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టుదలతో ఉన్నారు. ఈ మేరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా సమయం రెండు రోజులే ఉండడం, కొన్ని పనులు పూర్తికాకపోవడం.. మరోవైపు సమన్వయలోపాలతో ఆలయ అధికారులు అయోమయం చెందుతున్నారు. ఇప్పటికీ చాలా విషయాలు ఖరారు కాలేదని చెబుతున్నారు. ఇంతవరకు క్యూలైన్ల ఏర్పాట్లపై పూర్తి నిర్ణయం ఖరారు కాలేదు. గతంలో ఆలయం తూర్పు వైపున గేటు నుంచి రూ.100 దర్శనం, ఉచిత క్యూలైన్లు,


క్యూలైన్ల ఏర్పాటు పనులిలా..

అలాగే మునిసిపల్ స్కూలు భవనం పక్క నుంచి ఉచిత క్యూలైన్లలో భక్తులు రథసప్తమి రోజున స్వామిని దర్శించుకునేందుకు వచ్చేవారు. వీఐపీ, రూ.500 లైన్లలో భక్తులు స్థానిక పెద్దతోట ముందు నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్లలో దర్శనానికి వచ్చేవారు. ఈ ఏడాది సుమారు 1.20 లక్షల మంది భక్తులు రానున్నట్టు అధికారుల అంచనా. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ముందు భాగంలోని అన్ని భవనాలు, షెడ్లను పూర్తిగా తొలగించి విశాలంగా తయారుచేశారు. కానీ భక్తులకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది.

దాతలపై నిర్లక్ష్యమా?

దాతల పాసుల పేరిట ఈ ఏడాది కూడా అవకతవకలు జరిగే అవకాశం ఉందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి సుమారు 1,200 మంది దాతలు ఉండగా.. (మిగతా 7వ పేజీలో..)


ఆదిత్యుడి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు
- ప్రత్యేక కార్యాచరణతో బందోబస్తు
- అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి
- దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్
6 లో


విచారణ చేస్తున్న డాక్టర్ శ్రీనుబాబు తదితరులు

బాధ్యులపై చర్యలు తీసుకోండి
- మంత్రి అచ్చెన్న ఆదేశం
- 'సూది మరిచారు' కథనంపై స్పందన
6 లో

భలే చాన్స్!



- బీసీలకు స్వయం ఉపాధి రుణాలు
- 50 శాతం రాయితీపై అందించనున్న ప్రభుత్వం
- జిల్లాలో 2,828 యూనిట్ల మంజూరుకు నిర్ణయం
- వచ్చే నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి

ఇచ్ఛాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీసీలకు శుభవార్త చెప్పింది కూటమి ప్రభుత్వం. పెద్ద ఎత్తున ఉపాధి రుణాలు అందించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 28లోగా యూనిట్ల మంజూరు ప్రక్రియ పూర్తిచేయాలని భావిస్తోంది. జిల్లాలో 2,828 యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయించింది. బీసీల్లో ఏ,బీ,సీ,డీ వర్గాలకు యూనిట్లు మంజూరు చేయనున్నారు.

యూనిట్లు ఇవే..

ప్రధానంగా కుట్టు శిక్షణ, కోళ్లఫారాలు, పాడి, వస్త్ర దుకాణాలు, ఫొటో స్టూడియోలు, జిరాక్స్ షాపులు, ఇంటర్‌నెట్ కేంద్రాలు, బ్యూటీ పార్లర్లు తదితర యూనిట్లకు అవకాశం ఉంటుంది. యూనిట్‌కు సంబంధించి 50 శాతం బ్యాంకు రుణంగా అందిస్తారు. మిగతా 50 శాతం రాయితీ. బ్యాంకు నుంచి కూడా ప్రభుత్వమే రుణం ఇప్పిస్తుంది. ఇందులో రూపాయి కూడా లబ్ధిదారుడు కట్టనవసరం లేదు. అయితే 100 శాతం యూనిట్ ఏర్పాటు చేస్తేనే మంజూరు చేస్తారు. లేకుంటే మాత్రం అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. 21 నుంచి 60 సంవత్సరాల వయసు ఉన్నవారు అర్హులు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (ఏపీవోబీఎంఎంఎస్)లో నమోదు చేసుకోవాలి. మొత్తం 3 స్లాబుల్లో రుణాలు అందించేందుకు నిర్ణయించారు. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ రుణాలు అందిస్తారు. మొదటి స్లాబులో 1935 మందికి రూ.29.03 కోట్లు, రెండో స్లాబులో 581 మందికి రూ.14.52 కోట్లు, మూడో స్లాబులో 208 మందికి రూ.8.32 కోట్లు అందించనున్నారు. ప్రధానంగా జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసే బీసీ యువతకు రుణాలు అందించనుంది. ఇందులో బీసీ యువతకు 55 దుకాణాలకు గాను రూ.4.40 కోట్లు, అగ్రవర్ణాల్లోని పేద యువతకు ఎనిమిది దుకాణాల నిమిత్తం రూ.64 లక్షలు రుణం రూపంలో ఇవ్వనున్నారు. బీసీలతో పాటు అగ్రవర్ణాల్లో పేదలకు ఈబీసీ కోటా కింద రుణాలు అందించనున్నారు. ఈబీసీ విభాగంలో 12 మందికి రూ.21 లక్షలు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికి రూ.3 లక్షలు, రెడ్డి సామాజికవర్గంలో ఒకరికి రూ.2 లక్షలు, బ్రాహ్మణ సామాజికవర్గంలో 23 మందికి రూ.40 లక్షలు, క్షత్రియ విభాగంలో ఒకరికి రూ.2 లక్షలు, ఆర్యవైశ్యుల్లో ఇద్దరికి రూ.3 లక్షల చొప్పున రుణాలు అందించనున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. ఆ సామాజిక వర్గ యువతకు ఎటువంటి న్యాయం దక్కలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. 2014 నుంచి 2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో భారీగా రుణాలు, రాయితీలు అందించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నవరత్నాల పథకాలకు చేసిన కేటాయింపులనే.. కార్పొరేషన్ల వారీగా లెక్కలు చూపి చేతులు దులుపుకొన్నారు. దీనివల్ల బీసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.

సద్వినియోగం చేసుకోవాలి

స్వయం ఉపాధికి సంబంధించి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది. వంద శాతం యూనిట్లు పెడితేనే రుణంతో పాటు రాయితీ అందుతుంది. ఈ అవకాశాన్ని బీసీలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ 50 శాతం రాయితీ అందించడమే కాకుండా.. 50 శాతం బ్యాంకు రుణాలు కూడా అందిస్తుంది.

-గడ్డెమ్మ, బీసీ సంక్షేమ శాఖ అధికారి, శ్రీకాకుళం



పనస కాయలను తూకం వేస్తున్న వ్యాపారులు

పనసకు మంచి రోజులు

● కిలో రూ.18 ● రైతుల్లో ఆనందం

హరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పనస పంట.. రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ ఏడాది పనస దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు కాసింత ముందుగానే కాయ పెరగడంతో రైతుల్లో కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. ఉద్దానంలోని హరిపురం పనస ఎగుమతులకు ప్రధాన కేంద్రంగా మారింది. ఒక్క హరిపురంలోనే సుమారు 12 వరకు పనస కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కిలో ధర సుమారు రూ.18 నుంచి రూ.22 ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలోని సుమారు 70 ఉద్దాన, గిరిజన గ్రామాల్లో పనస పంట సాగులో ఉంది. సాధారణంగా కోల్‌కత్తా, కటక్, అహ్మదాబాద్, న్యూఢిల్లీ వంటి ప్రముఖ పట్టణాలలో పనసను ఊరగాయ, కూరలు, వంటకాల్లో అధికంగా వినియోగిస్తారు. దీంతో లేత, ముదురు కాకుండా మధ్యస్థ దశలో ఉన్న వాటిని అమ్మితేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. దీనికి గాను రైతులు ఆ దశలో ఉన్న కాయలను మార్కెట్లో పెడతారు. ఇలాగే కొనసాగాలంటే మండలంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేసి దళారుల బారి నుంచి తప్పించాలి. అలాగే తూనికలు, కొలతలు శాఖ అధికారులు దళారుల మోసాలపై నిఘా వేస్తే కొంతవరకైనా తమకు న్యాయం జరుగుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.



ఆటోలో హరిపురం బజారుకు తెచ్చిన పనస కాయలు

బాధ్యులపై చర్యలు తీసుకోండి

● మంత్రి అచ్చెన్న ఆదేశం ● 'సూది మరిచారు' కథనంపై స్పందన

టెక్కలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఈనెల 24న అప్పుడే పుట్టిన బిడ్డకు హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేసి తొడలో సూది మరచిపోయిన సంఘటనపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. దీనిపై విచారణకు ఆదేశించారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'వ్యాక్సిన్ వేశారు.. సూది మరిచారు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. మరోవైపు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ దీనిపై విచారణకు ఆదేశించారు. నరసన్నపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీపాన శ్రీనుబాబు, కార్యాలయ ప్రతినిధి కాశీని విచారణకు నియమించారు. వీరు గురువారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సూప రింటెండెంట్ డాక్టర్ సూర్యారావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్, మేటీ అసిస్టెంట్ లక్ష్మి, సిబ్బందిని విచారించారు. బాధిత బిడ్డతో పాటు తల్లి కల్పన నందిగాం మండలం కల్లాడలో తాతగారి ఇంటికి వెళ్లడంతో అక్కడికి వెళ్లి మరీ సంఘటనపై వివరాలు సేకరించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మాత్రం తొడలో సూది మర్చిపోవడం అసాధ్యమని... సూదిని ఎక్కడి నుంచి తెచ్చారో తమకు తెలియదని అంటున్నారు. బిడ్డ తల్లి కల్పన మాత్రం ఈ సూది తొడలోనే లభ్యమైందని చెబుతున్నారు. మరోవైపు ఆసుపత్రిలో జరిగిన సంఘటనపై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి స్పందించారు. వివరాలు తెలియజేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావును ఆదేశించారు.



కల్లాడలో బిడ్డను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనుబాబు

ఆ సూది సిరంజీకి సంబంధించినదే..

ఆ సూది సిరంజీకి సంబంధించినదేనని విచారణాధికారి డాక్టర్ సీపాన శ్రీనుబాబు స్పష్టం చేశారు. గురువారం నందిగాం మండలం కల్లాడలో బిడ్డను పరిశీలించారు. తల్లి కల్పనతో మాట్లాడారు. ఆ బిడ్డ వద్ద లభ్యమైన సూది సిరంజీకి సంబంధించినదిగా గుర్తించినట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బిడ్డ ఆరోగ్యంగా ఉందని, వ్యాక్సినేషన్ వేసిన ప్రాంతంలో వాపు కూడా లేదని గుర్తించామన్నారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన తెలిపారు.

రైతుబజారు... జంట పట్టణాలతో పాటు ఉద్దానం గ్రామాల రైతులు, వినియోగదారుల ఏళ్ల నాటి కల. ఊరించడం తప్పితే... కార్యరూపం దాల్చడం లేదు. ఎప్పటికప్పుడు నాయకులు హామీలు ఇవ్వడం... ఆ తరువాత ఏదో కారణంతో ఆగిపోవడం పరిపాటిగా మారింది. ఒకప్పుడు దీనికి చొరవ చూపిన టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో ఈసారైనా తమ చిరకాల కోరిక నెరవేర్చాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

- ప్రకటనలకే పరిమితమైన వైనం
- రోడ్డుపై వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం
- రైతులకు, కొనుగోలుదారులకు తప్పని ఇక్కట్లు



పలాసలో రోడ్డుపైనే కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

రైతుబజారుకు కార్యరూపమెప్పుడో!

కాశీబుగ్గ, జనవరి 30(ఆంధ్రజ్యోతి):

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో రైతుబజారు ఏర్పాటు చేయడంలో వైసీపీ సర్కారు విఫలమైంది. ఆర్భాటపు ప్రకటనలే మిగిలాయి తప్ప.. హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. జంట పట్టణాల్లో రైతుబజారు ఏర్పాటు చేస్తున్నామని 2019 ఆగస్టు 8న సీఎం జగన్ శాసనసభలో ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 రైతుబజార్లు ఏర్పాటుచేస్తున్నామని.. ఆ జాబితాలో పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలకు చోటిస్తున్నామని చెప్పారు. ఇందుకుగాను రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని..స్థల పరిశీలన, టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయ్యిందని అప్పటి వైసీపీ నాయకులు ప్రకటించారు. కానీ గత ఐదేళ్లలో అదిగో ఇదిగో అన్నారే తప్ప రైతుబజారు ఊసు లేదు.

● **టీడీపీ హయాంలో...**

టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతుబజారు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. 2018లో టెలిఫోన్ ఎక్స్ఛేంజి సమీపంలో స్థలాన్ని అధికారులు గుర్తించారు. టెండర్లు కూడా పూర్తి చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో ఆ స్థలం తమది అంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఇంతలో ఎన్నికలు రావడం.. అధికార మార్పిడి జరగడం పూర్తయ్యింది. 25 శాతంలోపు ఉన్న పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. జంట పట్టణాల్లో రైతుబజారుకు అనువైన ప్రాంతాలు ఉన్నా వైసీపీ ప్రభుత్వం గుర్తించడంలో విఫలమైంది. కరోనా సమయంలో కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో రాజన్న రైతుబజారు అంటూ భారీ హోర్డింగ్ పెట్టి వైసీపీ నేతలు హడావుడి చేశారు. అట్టహాసంగా ప్రారంభించారు. అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. అటు తరువాత పద్మనాభ పురం ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. జంట పట్టణాలకు దూరమని తేలడంతో ఆలోచనను విరమించుకున్నారు. అటు తరువాత ఎస్టీ హాస్టల్ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటుకు నిర్ణయించారు. కానీ కోర్టు కేసులు ఎదురుకావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. దీంతో జంట పట్టణాల్లో రైతుబజారు లేకుండా పోయింది.

● **బస్టాండ్ ప్రాంగణంలో..**

ప్రస్తుతం రైతుబజారు లేకపోవడంతో పాతబస్టాండ్ ప్రాంగణంలో కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ఒక వైపు మైదానం, మరోవైపు ఉద్దానం, ఇంకోవైపు తీర ప్రాంతం ఉండడంతో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్యకారులు చేపలను తెచ్చి ఇక్కడ విక్రయిస్తుంటారు. గిరిజనులు సైతం అటవీ ఉత్పత్తులు అమ్ముతుంటారు. వీరికి సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో దళారుల బారిన పడుతున్నారు. మరోవైపు జంట పట్టణాల్లో రహదారులపై షాపులు వెలుస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. పాత బస్టాండ్ ప్రాంగణంలో కూరగాయల దుకాణాలతో వాహనాలు కూడా నిలుపుకునేపరిస్థితి లేదు. రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న దళారులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. అటు పట్టణ వాసులకు తాజా కూరగాయలు దొరకని పరిస్థితి. దీంతో బాధలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వమైనా రైతుబజారు నిర్మిస్తుందన్న ఆశతో జంట పట్టణ, నియోజకవర్గ ప్రజలు ఉన్నారు.

● **ప్రభుత్వం దృష్టి పెట్టాలి..**



పలాస-కాశీబుగ్గలో రైతుబజారు ఏర్పాటు చేయకపోవడం దారుణం. గత ఐదేళ్లుగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారే తప్ప నిర్మించిన దాఖలాలు లేవు. దీంతో రోడ్లపైనే కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్త ప్రభుత్వమైనా రైతుబజారు నిర్మాణం చేపట్టాలి.

-రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాశీబుగ్గ

● **దళారుల ఇష్టారాజ్యం**



రైతులు రోడ్లపై కూరగాయలను విక్రయించుకోవాల్సి వస్తోంది. దళారులు ఎంతకు అడిగితే అంతకు పంటను విక్రయించుకుంటున్నారు. రైతుబజారు ఉంటే అటు రైతులకు గిట్టుబాటు అవుతుంది. కొనుగోలు దారులకు ఉపయుక్తంగా ఉంటుంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలు లభిస్తాయి. అందుకే రైతుబజారు ఏర్పాటుచేసి ఆదుకోవాలి.

-వేణుగోపాల్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, కాశీబుగ్గ

ఇదంతా స్మార్ట్‌ఫోన్ మాయ!

(ఐదో పేజీ తరువాయి)

ఫోన్ వినియోగానికి మొగ్గు చూపడంతో విద్యాప్రమాణాలు దెబ్బతిన్నట్టు స్పష్ట మవుతోంది.

● **జిల్లాలో 'అసర్' నివేదిక ఇలా..**

జిల్లాలో 14-18 ఏళ్ల మధ్య విద్యార్థులు, యువతను 'అసర్' సర్వే చేసింది. అందులో పదోతరగతి కంటే తక్కువ చదువుకున్నవా రు 54.9 శాతం ఉన్నారు. ఇందులో బాలురు 57.5 శాతం, బాలికలు 52.1 శాతం. ఇంటర్మీడియట్‌లో చేరినవారి సంఖ్య 28 శాతం ఉంది. ఇంటర్‌లో బాలురు 33.4 శాతం, బాలికలు 28.9 శాతం చేరారు. గ్రాడ్యుయే షన్ కోసం 9.5 శాతం చేరగా.. బాలురు 9.1 శాతం, బాలికలు 9.5శాతం ఉన్నారు. పూర్తిగా చదవని వారు 6.7 శాతం మంది ఉండగా.. ఇందులో 7.8 శాతం బాలురు, 5.5 శాతం బాలికలు ఉన్నారు. ఇక వృత్తి విద్యా కోర్సుల్లో చేరినవారి సంఖ్య పరిశీలిస్తే... యువత 6.3 శాతం ఉండగా, 7.8 శాతం బాలురు, 4.6 శాతం బాలికలు ఉన్నారు.

● ప్రాథమిక పఠనం విషయంలో.. 14- 16 వయసు గల వారిలో చేసిన సర్వేలో 75.4 శాతం రెండో తరగతి చదివే స్థాయి లోనే ఉన్నారు. అలాగే 17-18 వయసు గల వారిలో 75.8 శాతం మంది రెండో తరగతి చదివేస్థాయిలో ఉన్నారు. 'ప్రాథమిక అంకగ ణితం'లో 58.6 శాతం విద్యార్థులు 14-16 ఏళ్ల వారు లెక్కలు చేయగలుగుతున్నారు. 17-18 ఏళ్ల వారు... 57.1 శాతం లెక్కలు చేయగలుగుతున్నారు. అంకెలు, వంద లోపు సంఖ్యలు గుర్తించడం, తీసివేత, భాగాహారం వంటివి చేయగలుగుతున్నట్టు సర్వేలో గుర్తించారు.

● ఇంగ్లీషులో వాక్యాలను చదవగలిగేవారిని పరిశీలిస్తే.. 14-16 ఏళ్లలోపు విద్యార్థులు 71.1 శాతం, 17-18ఏళ్ల యువత 76.4 శాతం ఉన్నారు. దినచర్యలో భాగంగా ప్రతిరోజు సమయాన్ని లెక్కించగలిగేవారిలో 14-18 ఏళ్లలోపువారు 64.9 శాతం ఉన్నారు. బరువు, పరిమాణాన్ని కొలవగల సామర్థ్యం 65.1 శాతం మందికి, పొడవు కొలిచే సామర్థ్యం 93.8 శాతం మందికి తెలుసు. ద్రవపదార్థాలను లీటర్లలో కొలిచే విషయం 61.5 శాతం మందికి తెలుసునని సర్వేలో వెల్లడించారు.



మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించిన దృశ్యం

జన సంద్రంగా మరియగిరి

● భక్తుల ప్రత్యేక ప్రార్థనలు

వీరఘట్టం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన మేరీమాత యాత్ర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కులమతాలకు అతీతంగా సుమారు 50 వేల మంది భక్తులు వచ్చి మేరీమాత విగ్రహాల వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. కొబ్బరి కాయలు కొట్టి, తలనీలాలు అర్పించడం మరియగిరి యాత్రలో ప్రత్యేకత. ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మరియగిరిపై చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ కళానిధితో పాటు 90 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలకొండ, పార్వతీపురం ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు.



యాత్రలో పాల్గొన్న భక్తులు

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

● ప్రత్యేక కార్యాచరణతో బందోబస్తు ● అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి

● దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్



రథసప్తమి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

అరసవల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి రోజున ఆదిత్యుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. ఆర్డీవో ప్రత్యూష, ఇతర అధికారులతో కలిసి రథసప్తమి ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ముందుగా ఆలయ మ్యాప్‌ను పరిశీలించి, ఎక్కడెక్కడ ఎంత మంది సిబ్బంది అవసరం అన్న విషయాలపై చర్చించారు. ఆలయ సింహద్వారం, దర్శన మార్గాలు, బారికేడ్ల ఏర్పాటు, క్యూలైన్లు, ప్రవేశ ద్వారం, మండపం, ఇంద్ర పుష్కరిణి, ఉచిత దర్శన మార్గం, ప్రసాదం కౌంటర్లు, కేశఖండన శాల తదితర ప్రదేశాలను జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఉచిత దర్శనానికి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో ఉంటారు కాబట్టి క్యూలైన్ల నిర్వహణ క్రమపద్ధతిలో ఉండాలన్నారు. పటిష్ఠమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. అనంతరం ఈవో కార్యాలయంలో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

అందరికీ న్యాయం..

ఏడాదిగా దినసరి వేతనంపై పనిచేస్తున్న వారికి జీతాలు అందకపోవడంపై కమిషనర్ రామచంద్ర మోహన్ స్పందించారు. రథసప్తమి ఉత్సవాలు ముగిసిన తరువాత ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఈవో భద్రాజీ ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయం డీసీ శోభారాణి, విజయనగరం నుంచి ఈవో ప్రసాదరావు, స్థపతి శ్రీనివాసాచార్యులు, దుర్గేష్, ఈఈ కృష్ణ, డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, నాగరాజు, ఎస్ఐ హరికృష్ణ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు రండి

● మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే శంకర్ ఆహ్వానం



అరసవల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న శ్రీ సూర్యనారాయణ స్వామి వారి రథసప్తమి వేడుకలకు రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆహ్వానించారు. విజయవాడలో లోకేశ్‌ను కలిసిన ఆయన... ఉత్సవాలకు రావాలని కోరారు. రాష్ట్ర పండుగగా ప్రకటించిన నాటి నుంచి ఏర్పాట్లపై పూర్తిస్థాయిలో దృష్టి సారించామని చెప్పారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, కలెక్టర్, ఎస్పీలతో కలిసి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని లోకేశ్‌కు వివరించారు. అభివృద్ధి పనులపై ఫొటోలు, వీడియోలను ఆయనకు చూపించి... తొలి పండుగకు రావాలంటూ ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై లోకేశ్ సానుకూలంగా స్పందిస్తూ అన్ని విధాలా సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున రావడానికి కుదరదని... ఆ తరువాత తప్పక వస్తానని హామీ ఇచ్చారని శంకర్ తెలిపారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

బాపూజీ బాట ఆదర్శం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి సత్యం, అహింస మార్గాలను అందించి.. పోరాట స్ఫూర్తికి ప్రతిరూపంగా నిలిచిన మహాత్మాగాంధీ చూపిన బాట అందరికీ ఆదర్శమని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశభక్తిని పెంపొందిచేందుకు స్మృతివనం ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. తొలుత గాంధీ మందిరం ఆవరణలో 105 అడుగుల ఎత్తులో ఉన్న జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద విశ్వశాంతి హోమాన్ని కె.వేణుగోపాల్, సరోజ దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పైడి హరనాథరావు, నిష్టల నర్సింహమూర్తి, సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, బి.మల్లేశ్వరరావు, ఎస్.అప్పన్న, కె.మురళీధర్, బి.లక్ష్మణరావు, డాక్టర్ సీహెచ్. కృష్ణమోహన్, పి.రవికుమార్, బి.దేవభూషణ్, ఎస్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

- వచ్చే నెల 3న నోటిఫికేషన్.. అదే రోజునుంచి నామినేషన్ల స్వీకరణ
- మార్చి 3 నుంచి కౌంటింగ్
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ వచ్చే నెల 27వ తేదీన నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 3న నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవ్వై 10వ తేదీ సాయంత్రం 3.00 గంటలతో ముగుస్తుందని పేర్కొన్నారు. 11న పరిశీలన, 13న ఉప సంహరణ ప్రక్రియ జరుగుతాయి. 27వ తేదీ ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి 3న కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై 8వ తేదీతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫారం-26 ద్వారా అఫిడవిట్ సమర్పించాలని, సాధారణ ఎన్నికల మాదిరిగానే ఇప్పుడు కూడా అన్ని రకాల నిబంధనలు అభ్యర్థులకు వర్తిస్తాయని పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 4,829 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 3,275, మహిళా ఓటర్లు 1554 మంది ఉన్నారు. కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసేందుకు ఎంపీడీవో, వీడియోగ్రాఫర్‌తో కూడిన 30 ఎంసీసీ బృందాలను మండలానికి ఒకటి చొప్పున నియమించామన్నారు. అలాగే మండలానికి ఒక తహసీల్దారు, ఎస్ఐ, వీడియోగ్రాఫర్‌తో కూడిన 30 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



గాంధీ జీవితమే ఒక సందేశం

- అంబేడ్కర్ వర్సిటీ వీసీ రజని

ఎచ్చెర్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ జీవితమే ఓ సందేశమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా వర్సిటీలో గురువారం మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సత్యం, ధర్మం, అహింస ఆయుధాలుగా మహాత్ముడు స్వరాజ్య పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత, ఎస్‌వో కె.సామ్రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వర్సిటీలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ రజని తదితరులు

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

- మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి

ఆమదాలవలస, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దామని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వన్‌వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ స్ఫూర్తి ఆశయాల వల్లనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. నేటి యువత ఆయన ఆశయాలకు అనుగుణంగా సాగాలన్నారు. కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, షన్ముఖరావు, రాజులు, రమణ, సాయిరాం, అప్పారావు, కృష్ణమూర్తి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్యవతి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్ఛాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపవేస్తున్నట్టు విద్యుత్ ఈఈ విఘ్నేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెల్లుపడ, దాసన్నపేట, రథం వీధి, ఏఎస్ పేట, పురుషోత్తపురం, తేలుకుంచి, హరిపురం, మశాఖ పురం, జగన్నాథపురం, బిర్లంగి, కొళిగాం, తోటూరు, పాయితారి, ముచ్చింద్ర, కేదారి పురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

- జి.సిగడాం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు శ్రీకాకుళం ఈఈ, జి.సిగడాం ఏఈలు పి.యోగేశ్వరరావు, పి.దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జి.సిగడాం, బాతువ, గెడ్డకంచరాం, నడిమివలస, జాడ, ఎందువపేట, సేతుభీమవరం, చెట్టుపొది లాం, గొబ్బూరు, నిద్దాం, అద్వానంపేట, మదుపాం, వెలగాడ, చంద్రయ్యపేట, దేవరవలస, ఎస్‌పీఆర్ పురం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- రణస్థలం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11కేవీ పరిధిలోని కమ్మసిగడాం ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకూ సరఫరా నిలిపిస్తున్నట్టు ఈఈ యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొనారు. దీంతో కమ్మసిగడాం, వేల్పురాయి, దేవరాపల్లి, అర్జునవలస గ్రామంలో విద్యుత్ సరపరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎచ్చెర్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల గేటు ముందు ద్విచక్రవాహనం నిలిపి.. కళాశాల లోపలికి వెళ్లి తిరిగి వచ్చేసరికి మాయమైందని గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామానికి చెందిన అంగ చంద్రశేఖరరావు కుమార్తె ఈ కళాశాలలో చదువుతోంది. దీంతో కళాశాల పని మీద వచ్చి ఆయన తన బైక్‌ను గేట్ బయట ఉంచి లోపలికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వచ్చేసరికి బైక్ చోరీకి గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇద్దరు కార్మికులకు గాయాలు

రణస్థలం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం వద్ద గల ఒక రసాయనిక పరిశ్రమలో గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో విజయనగరానికి చెందిన పి.రమేష్, రెల్లివలస గ్రామానికి చెందిన ఐ.నర్సునాయుడు గాయపడ్డారు. పరిశ్రమలో కూలింగ్ టవర్ ఫ్యాన్లు ప్రమాదవశాత్తు తగడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన కార్మికులను విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. నాలుగు కేటగిరిల్లో 57మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వచ్చే నెల 9న రెండో విడత ఎంపికలు నిర్వహిస్తామని డిఫరెంట్ ఎబిల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్డపల్లి సూర్యనారాయణ అన్నారు.

పశువైద్య శిబిరం

ఆమదాలవలస, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పశువైద్య శిబిరాలు నిర్వహిస్తుందని పశు సంవర్థక జేడీ కంచరాన రాజగోపాలరావు అన్నారు. గురువారం రామచంద్రాపురం గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో అయన పాల్గొని మాట్లాడారు

ప్రజా భాగస్వామ్యంతోనే కుష్ఠువ్యాధి నిర్మూలన

- డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ


ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో తదితరులు

అరసవల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రజా భాగస్వామ్యంతోనే కుష్ఠువ్యాధి నిర్మూలన సాధ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో 'కుష్ఠు వ్యతిరేక దినం' ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఫిబ్రవరి 13 నుంచి 15 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా వైద్య సిబ్బంది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కుష్ఠువ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ శ్రీకాంత్, డీపీఎంవో వాన సురేష్ కుమార్, డీఎస్ఎంవో డాక్టర్ ప్రవీణ్, డెమో వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ ధార్మిక సభ


అశోక్‌ను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతులు

ఇచ్ఛాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాతాళసిద్ధేశ్వర ఆలయం సమీపంలో గల ఆశ్రమంలో హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపకులు బాల బ్రహ్మానంద సరస్వతి ఆధ్వర్యంలో గురువారం వారాహి యాగం, హిందూ ధార్మిక సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాటాడుతూ.. సమ సమాజ స్థాప న కోసం బాలబ్రహ్మానంద సరస్వతి చేస్తున్న చిరుప్రయత్నం అభినందనీయమన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం 12మంది స్వామీజీల నుంచి ఎమ్మెల్యే ఆశిస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో హరిద్వార్, చిన్మయమిషన్, పూరి, విజయనగరం, చీపురుపల్లి, లైదాం, పొందూరు, భువనేశ్వర్, జ్ఞానపీఠం, ఇస్కాన్, పీఠాధిపతులతోపాటు కూటమి నాయకులు నందికి జాని, కాళ్ల జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ పింఛన్‌దారులకు అండగా..

పొందూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కదలలేని స్థితిలో ఉన్న పింఛన్‌దారుకు, వృద్ధులకు మండల పింఛన్‌దారుల సంక్షేమ సంఘ ప్రతినిధులు అండగా నిలుస్తున్నారు. పింఛన్‌దారులు తమ జీవిత ధ్రువ పత్రాలను స్థానిక ట్రెజరీ కార్యాలయానికి అందించాల్సి ఉంది. కదలలేని స్థితిలో ఉన్న, వృద్ధ పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి జీవిత ధ్రువ పత్రాలను పూర్తిచేసి వాటిని అధికారులకు అందిస్తున్నారు. సుమారు 40 మంది వరకు ఇటువంటివారి లైఫ్ సర్టిఫికేట్లను ట్రెజరీలో అందించినట్టు ఆ సంఘ ప్రతినిధులు పి.సూర్యారావు, వి.దామోదరరావు, వి.సూర్యారావు, పి.దివాకర్‌పాత్రో తదితరులు తెలిపారు.

తరగతుల విలీనం మానుకోవాలి

కంచిలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పల్లి పంచాయతీ నారాయణ బట్టీ పాఠశాల నుంచి 3,4,5 తరగతులు బెల్లుపడా పాఠశాలలో విలీనం చేయాలనే నిర్ణయం మానుకోవాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామం నుంచి బెల్లుపడా పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలంటే గోవింద సాగరం చానెల్ దాటాలని, ఇది ఎంతో ప్రమాదకరమన్నారు. అందువల్ల ప్రభుత్వం విలీన నిర్ణయం మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనపల సురేష్, కూటమి నాయకులు కిశోర్ పాడీ, బి.ఆనంద్, కె.వల్లయ్య, గణేష్, గ్రామస్థులు పాల్గొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంఈవో శివరాంప్రసాద్ తెలిపారు.

ఒప్పంగి మీదుగా అరసవల్లి చేరుకోవాలి

కంచిలి/సోంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు ఒప్పంగి మీదుగా చేరుకోవాలని సోంపేట సీఐ బి.మంగరాజు అన్నారు. గురువారం వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పి.పారినాయిడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అంపోలు జైలు రోడ్డు దాటిన తర్వాత శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ (పెదపాడు)కు కాస్త ముందు ఉన్న రోడ్డు మీదుగా శాస్త్రులపేట, సానివాడ గ్రామాల మీదుగా ఒప్పంగి చేరుకుని.. వాడాడ జంక్షన్ మీదుగా అరసవల్లి ఇంద్రపుష్కరిణి సమీపానికి చేరుకోవాలన్నారు. రథసప్తమి పండగను రాష్ట్ర పండగగా ప్రభుత్వం చేపడుతున్న నేపథ్యంలో శ్రీకాకుళం పట్టణానికి రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనచోదకులు, ట్యాక్సీ, బస్సు డ్రైవర్లు, ఆటోవాళ్లు గమనించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి మండలాలకు చెందిన భక్తులు సహకరించాలని కోరారు.

సూర్యనమస్కారాలు విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వైద్యాధికారి జగదీష్

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 2న నగరంలోని 80 అడుగుల రోడ్డులో నిర్వహించనున్న సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్ కోరారు. నగరంలోని ఆయుష్ కార్యాలయంలో వివిధ యోగా సెంటర్ల కన్వీనర్లతో గురువారం సమావేశమయ్యారు. అందరూ కలిసికట్టుగా కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ కె.మురళీధర్, పతంజలి యోగా కన్వీనర్ డి.చిన్నబాబు, సూర్యప్రణవ కో-ఆర్డినేటర్ తంగి స్వాతి, ఆయుష్ సిబ్బంది శేఖర్, యోగా కన్వీనర్ వి.మురళీకృష్ణ, శిక్షకురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల బంద్ ప్రశాంతం


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వ్యాపారులు

రణస్థలం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జేఆర్ పురం పట్టణం బంద్ ప్రశాంతంగా సాగింది. జేఆర్ పురం జాతీయ రహదారిపై తలపెట్టిన ఫ్లైఓవర్ పనులు వ్యాపారులు, ప్రజలతో చర్చించుకుండా సర్వేలు చేయడాన్ని వారు నిరసిస్తూ గురువారం బంద్ చేపట్టారు. స్వచ్ఛందంగా అన్ని దుకాణాలు మూసివేసి వ్యాపారులు బంద్‌లో పాల్గొన్నారు. అదేవిధంగా పబ్లిక్, ప్రైవేట్ బ్యాంక్స్, వివిధ సంస్థల మూసివేసి సంఘీభావం తెలిపాయి. ర్యాలీగా వెళ్లి సమస్యలతో కూడిన వినత పత్రం తహసీల్దార్ ఎస్.ప్రసాద్‌కు అందించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అరసవల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కల్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు అంగన్‌వాడీల విషయంలో ఇచ్చిన తీర్పు అమలు చేయాలని కోరారు. అఖిల భారత సంఘం పిలుపు మేరకు వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖలు రాశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, 7వ పేకమీషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు.

మదర్ థెరిస్సా ఆశ్రమం సందర్శన


దుప్పట్లు పంపిణీ చేస్తున్న న్యాయాధికారి

గుజరాతీపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సానావీధి వద్దగల మధర్ థెరిస్సా ఆ శ్రమాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు గురువారం సందర్శించారు. నలుగురికీ సేవచేసే సేవాభావం అందరిలోనూ ఉండాలని, వృద్ధులు దేశానికి ఎప్పటికీ భారం కాదన్నారు. జాతిపిత మహాత్మగాంధీని స్మరించుకుంటూ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు దుప్పట్లు, పండ్లను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రి

ఎస్సీ వర్గీకరణపై స్పష్టత ఇవ్వాలి

గుజరాతీపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ముఖ్యమంత్రి వచ్చే నెల 7వ తేదీలోగా స్పష్టత ఇవ్వాలని ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నింగి నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై వచ్చేనెల 7న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమంపై గురువారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, డి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం జీవన్ జ్యోతి' వినియోగించుకోవాలి

లావేరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏపీజీవీబీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పీఎం జీవన్ జ్యోతి బీమా పథకాన్ని బ్యాంకు ఖాతాదారులందరు వినియోగించుకోవాలని ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ లావేటి అనంతరావు అన్నారు. గురువారం మురపాక ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఇప్పిలి కాంతమ్మ (చినమురపాక) బోనెల అచ్చియ్య (కేశవరాయునిపాలెం), నాయని పైడితల్లి (కేశవరాయునిపాలేం) లబ్ధిదారులకు ఈ పథకం కింద ఒక్కొక్కరికి మంజూరైన రూ.2 లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. బ్యాంక్ మేనేజర్ ఎం.వెంకట సత్యనారాయణ, అకౌంటెంట్ అశోక్ కుమార్, చినమురపాక మాజీ సర్పంచ్ సిరిపురపు జగన్నాథం, సిబ్బంది షన్ముఖరావు, పెంటయ్యరెడ్డి పాల్గొన్నారు.

ఇక రెండు రోజులే!

(ఇదో పేజీ తరువాయి)

ఇప్పటివరకు 1,230 మంది పేర్లు నమోదయినట్టు ఆలయ వర్గాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న దాతలందరూ ఎలా పాసుల కోసం నమోదు చేసుకున్నారో.. ఆలయ సిబ్బందికే తెలియాలి. అలాగే ప్రతీ రూ.లక్ష అందజేసిన దాతలకు గతంలో ఒక్క పాసు ఇచ్చేవారు. ఆ పాసుపై నలుగురికి ఆదిత్యుడి దర్శనాన్ని కల్పించేవారు. ఈ ఏడాది మాత్రం రూ.5లక్షలు ఇచ్చిన వారికి అదీ ఒక్క పాసు మాత్రమే జారీ చేస్తామనడంపై దాతలు విచారం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దాతల సహాయంతో చేపట్టిన నిర్మాణాలను.. ఆలయ అభివృద్ధిలో భాగంగా పూర్తిగా తొలగించారు. కనీసం ఈ విషయం కూడా తమకు తెలియజేయకపోవడం అన్యాయమని దాతలు ఆవేదన చెందుతున్నారు.

ఆ చెట్టు ఏం చేసిందో..?

భక్తులు ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం అక్కడే ఉన్న రావిచెట్టుకు పూజలు చేసేవారు. అభివృద్ధిలో భాగంగా ఆ చెట్టును కూడా తొలగించేందుకు ప్రయత్నించి, చివరకు సగం కొమ్మలను నరికివేయడంపై భక్తులు ఆవేదనకు గురవుతున్నారు. ఆ చెట్టు ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారు.

సీసీ కెమెరాలు.. ఎక్కడో?

వేలాదిమంది భక్తులు, వీఐపీలు, వీవీఐపీలు ఆదిత్యుడి దర్శనానికి వస్తున్నందున భద్రతా ఏర్పాట్ల విషయంలో సీసీ కెమెరాల ఏర్పాటు కీలకం. కానీ సీసీ కెమెరాలను ఏయే పాయింట్లలో ఏర్పాటు చేయాలో ఇప్పటికీ ఖరారు కాలేదు. అలాగే గర్భిణులు, పాలిచ్చే తల్లులకు, పిల్లలకు, దివ్యాంగులకు, వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నా.. పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదని భక్తులు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపచేసేలా రథసప్తమి వేడుకలు నిర్వహించాలని కోరుతున్నారు.

అధికారులకు 'రథసప్తమి' బాధ్యతలు

శ్రీకాకుళం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పండగ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి 'రథసప్తమి' వేడుకల నిర్వహణకు కీలక అధికారులకు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విశాఖపట్నం దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, విజయనగరం మాన్సాస్ ట్రస్ట్ డిప్యూటీ కమిషనర్ కేఎన్‌వీడీవీ ప్రసాద్, నిడదవోలులో తిమ్మరాజుపాలెం కొత్తమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, విజయనగరం పైడితల్లి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డీవీవీ ప్రసాదరావు, శ్రీకాకుళం దేవదాయశాఖ జిల్లా అధికారి బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్‌ను ప్రభుత్వం కేటాయించింది. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో కేవీవీ కృష్ణ(డీఈ-విశాఖ), టి.చందన (ఏఈ-శ్రీకాకుళం), కె.సాయి కృష్ణ (ఏసీ-విజయనగరం), సీహెచ్ గజపతిరావు (ఏఈఈ-పార్వతీపురం మన్యం), బి.వెంకటరమణ మూర్తి, ఆర్.ప్రవీణ్ చందు (టీఏ-శ్రీకాకుళం), టీవీ దుర్గాప్రసాద్ (సర్వేయర్-కన్సోలిడేటెడ్)లను రథసప్తమి ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నియమించారు. వీరితో పాటు జిల్లాలో పలు దేవాలయాల ఈవోలను ఇక్కడకు కేటాయించారు. వీరంతా శుక్రవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు అరసవల్లిలోనే ఉంటూ విధులు నిర్వహించనున్నారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన జగన్‌రెడ్డి

ఆమదాలవలస, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మార్చేశారని ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.పది లక్షల కోట్లు అప్పు చేశారని, ఆ అప్పుకు ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, రూ.1.40 లక్షల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తుందని, దీనివల్ల ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై పెనుభారం పడిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి జగన్ ప్రభుత్వం పెట్టిన రూ.22 వేల కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు వల్ల రాష్ట్రానికి అప్పులు కూడా పుట్టని పరిస్థితి నెలకొందన్నారు. జగన్‌రెడ్డి విలాసాలు, జల్సాలతో దుబారా చేశారని మండిపడ్డారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాల్టీ పరిధిలో శ్రీశయన కులస్థులకు, రూరల్ పరిధిలో గౌడ కులస్థులకు, కవిటి మండలంలో శ్రీశయన కులస్థలకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కలెక్టర్ సమక్షంలో వచ్చే నెల7న డ్రా తీస్తామన్నారు.

సర్వే పక్కాగా చేపట్టాలి

బూర్జ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేను పక్కాగా చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. గురువారం బూర్జ, కొల్లివలస, గుత్తావల్లి, చీడివలస గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఈవోఆర్‌డీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాత్ర ఏర్పాట్లు పరిశీలన

గార, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్వేతగిరిపై ఫిబ్రవరి 8న భీష్మ ఏకాదశి సందర్భంగా జరగనున్న యాత్రకు సంబంధించి ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఎస్ఐ ఆర్.జనార్ధనరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డితో కలిసి పరిశీలించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిసా నుంచి వేలాది మంది భక్తులు ఈ యాత్రకు తరలి రానున్న నేపథ్యంలో క్యూలైన్లు, బారికేడ్లు, కొండ పైకి వెళ్లే భక్తులకు స్వామి దర్శనం కోసం ఏర్పాట్లు పరిశీలించారు. కొండ కింద బూరవల్లి, శ్రీకూర్మం రూట్లలో వచ్చే వాహనాలు పార్కింగ్ ఏర్పాట్లు పరిశీలించారు.

ఎన్నికల కోడ్‌తో నిలిచిన సమావేశం

సరుబుజ్జిలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎన్నికల కోడ్ అడ్డంకితో నిలిపివేశారు. ముందుగా పంపిన సమాచారం మేరకు జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ గోవింద వెంకటసివానందమూర్తి, మండల ప్రత్యేకాహ్వానితులు కేవీజే సత్యనారాయణ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఎంపీడీవో పావని మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.



దుకాణాలపై పడి.. ప్రజలపై దాడికి దిగి

● భయాందోళనకు గురిచేస్తున్న పశువులు ● ఇదీ శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో పరిస్థితి



పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో సంచరిస్తున్న పశువులు

శ్రీకాకుళం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాముల మార్కెట్‌లో పశువులు వ్యాపారులు, వినియోగదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మార్కెట్లో దుకాణాలపై పడి కూరగాయలు, సరకులు ధ్వంసం చేస్తున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నగరంలోని కొందరుయజమానులు ఉదయం,రాత్రి పాలు పదికిన తర్వాత ఆవులను రోడ్లపైకి విడిచిపెడుతున్నారు. అవి పొట్టి శ్రీరాముల మార్కెట్‌లో కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు తిని అక్కడే తిష్ఠవేస్తున్నాయి. కూరగాయలు, చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు పశువులు పొడుస్తాయేమోనని భయాందోళన చెందుతున్నారు.మార్కెట్ పరిసరాల్లో సంచరించే ప్రజలపై దాడిచేసి గాయపరుస్తున్నాయని పలువురు వాపోతున్నారు. మార్కెట్‌తోపాటు రోడ్లపై పశువులు సంచరిస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోకపో వడంపై సర్వత్రా నిరసన వ్యక మవుతోంది. యజమానులకు నోటీసులిచ్చి బందెలదొడ్డికి తరలించాల్సి ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మార్కెట్‌కు వస్తున్న పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మార్కెట్, పరిసరాల్లో సంచరిస్తున్న పశువులను బయటికి పంపించే సమయంలో దుకాణాలపై పడి కూరగాయలు చెల్లాచెదురు చేస్తున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మార్కెట్‌తోపాటు పరిసరాల్లో పశువుల సంచారాన్ని అరికట్టాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

కోసంగిపురంలో మృతదేహం గుర్తింపు

పలాస, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతజాతీయరహదారి కోసంగిపురం గ్రామ సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు.. ఆరు రోజులుగా ఓ మురుగుకాలువలో 40 సంవత్సరాలు వయసుగల పురుషుడి మృతదేహం పడిఉంది. ఆ మృతదేహం ఛిద్రమైన ఉంది. మెడలో రుద్రాక్షమాల,దుస్తులు తప్పా ఆయనకు చెందిన ఆనవాళ్లు ఏవీ లభ్యం కాలేదు. శరీరమంతా పురుగులు పట్టి కనీసం గుర్తించడానికి కూడా ఆనవాళ్లు లేకుండా పోయాయి. మృతదేహాన్ని శవగారానికి తరలించడానికి కూడా పోలీసులకు కష్టతరంగా మారింది.ఈమేరకు గుర్తుతెలియని మృతదేహం కింద పోలీసులు కేసు నమోదుచేశారు.

ఏడు ద్విచక్ర వాహనాల స్వాధీనం

టెక్కలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశాకు చెందిన ఐదుగురు గతఏడాది డిసెంబరు 27, ఈఏడాది జనవరి 11న దొంగిలించిన ఏడు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు శుక్రవారం సీఐ ఎ.విజయ్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. టెక్కలిలో ద్విచక్రవాహనాలు వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో క్రైం పార్టీ దర్యాప్తుచేపట్టింది. ఈమేరకు బుధవారం సాయంత్రం నౌపడా-మెళియాపుట్టి రోడ్డు జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఒడిశా నుంచి టెక్కలివస్తున్న ముగ్గురు పట్టుబడగా ఇద్దరు వాహనాలపై పరారయ్యారు. వీరి వద్దనుంచి టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు ద్విచక్రవాహనాలు, ఒడిశాలోని రాయగడ ప్రాంతంలోని మునిగుడ పోలీస్‌స్టేషన్ పరిధిలో,మన్యం జిల్లా పార్వతీపురంలో చోరీకి గురైన ఒక్కో ద్విచక్రవాహనం కలిపి మొత్తం ఏడువాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో టెక్కలి అంబేడ్కర్ వీధికి చెందిన పడాల అఖిల్, మరో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఈకేసును ఎస్ఐ రాము, క్రైమ్ పార్టీ పోలీసులు దర్యాప్తుచేశారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు

టెక్కలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి-తెంబూరు రోడ్డులో జిల్లా కేంద్రాసుపత్రి మెయిన్‌గేట్ సమీపంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన షాపులను శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వేనెంబరు 503-19ఏలో అక్రమంగా నిర్మించిన భవనాలను తహసీల్దార్ ఎస్.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు, రెవెన్యూ సిబ్బంది రికార్డులు పరిశీలించి తొలగింపునకు చర్యలు చేపట్టారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేస్తే బలవంతంగా తొలగిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

జలుమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో 16 బృందాలతో ఉపాధిహామీ పనులు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సార్పీ పున్నెపు నాయుడు తెలిపారు. జలుమూరులో డీఆర్పీలతో సమావేశం నిర్వహించి సామాజిక తనిఖీల్లో చేపట్టాల్సిన పనులను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24వ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.27.98 కోట్లు పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమయపాలన పాటించండి: డీఎంహెచ్‌వో



పెద్దలంబలో కిడ్నీ రోగుల చీటీని పరిశీలిస్తున్న బాలమురళీకృష్ణ

జలుమూరు (సారవకోట)జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు,సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ ఆదేశించారు. గురువారం సారవకోట మండలంలోని బొంతు పీహెచ్‌సీ తనిఖీచేశారు.ఈ సందర్భంగా రోగులకు నమ్మకం కలిగేలా వైద్యసేవలందించి ఓపీకి రోగుల హాజరు పెంచాలన్నారు.రోగులకు మాత్రలు ఇచ్చేటపుడు ఎక్సుపైర్ తేదీ చూసి పంపిణీ చేయాలన్నారు. అనంతరం పెద్దలంబ సందర్శించి కిడ్నీ రోగులతో మాట్లాడారు. పెయిన్ కిల్లర్ మాత్రలు అధికంగా వాడడం వల్ల కిడ్నీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వైద్యుల సూచనలు మేరకే వాడాలని బాలమురళీకృష్ణ సూచించారు. గ్రామంలో 20 మంది వరకు కిడ్నీ రోగులు ఉన్నా, ఇద్దరు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు గుర్తించారు. పీహెచ్‌సీలో కిడ్నీ సమస్యలకు సంబంధించిన మాత్రలు ఉంచడానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో వైద్యాధికారులు సుస్మిత, సుధారాణి, సారవకోట వైద్యాధికారులు దేవిక పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ: డీఈవో

హిరమండలం,జనవరి30,(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణసంస్థ రూపొందించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని డీఈవో ఎస్.తిరుమలచైతన్య కోరారు. గురువారం హిరమండలం ప్రభుత్వోన్నత పాఠశాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు దగ్గరపడుతుండడంతో ఎలా చదవాలో అవగాహన కల్పించారు.చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయనతోపాటు డైట్ గణిత అధ్యాపకులు లీలామోహన్, హెచ్‌ఎం తులగాపు కేశవరావు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి: డీడీ

కొత్తూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఐటీడీఏ డీడీ అన్నదొర కోరారు. గురువారం కొత్తూరు మండలంలోని లబ్బ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం ఆర్‌వో ప్లాంట్ పరిశీలించారు.



యాత్ర జరిగే ప్రదేశంలో పేరుకుపోయిన చెత్త

రోడ్డు పక్కన చెత్త.. రాకపోకలకు అగచాట్లు

● ఇదీ శ్వేతగిరి యాత్ర జరిగే ప్రదేశంలో దుస్థితి

గార,జనవరి 30(ఆంధ్రజ్యోతి):శ్వేతగిరియాత్ర జరిగే ప్రదేశంలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ఇక్కడ వచ్చే యాత్రీకులు, వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు. శాలిహుండాం పంచాయతీలో చెత్త సంపద కేంద్రం ఏర్పాటుచేశారు. అయితేగ్రామాల్లో సేకరించిన చెత్తను యాత్ర జరిగే ప్రదేశంలో పోగుచేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన వేసే కుప్పలకు నిప్పుపెట్టడం వల్ల పొగ వల్ల వాహనచోదకులు రాకపోకలకు అగచాట్లకు గురవుతున్నారు.వచ్చేనెల 8న శాలిహుండం యాత్రజరగనున్న నేపథ్యంలో చెత్త కుప్పలు తొలగించి శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

బకాయిలు చెల్లిస్తున్న కూటమి ప్రభుత్వం

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



మాట్లాడుతున్న రమణమూర్తి

నరసన్నపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వైసీపీ ప్రభుత్వానికి సంబంధించిన బకాయిలు ఏడునెలల్లో రూ.22వేల కోట్లును కూటమి ప్రభుత్వం చెల్లించిందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీచెల్లింపుతో ప్రస్తుతం లక్షా 40వేల కోట్లు చెల్లింపుల భారం ప్రభుత్వంపై పడడంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని తెలిపారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్‌కు అనుమతుల్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి జగన్ కుటుంబం రూ.ఎనిమిది లక్షల కోట్లు సంపాదించిందని ఆరోపించారు. సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టారని విమర్శించారు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం ప్రదర్శించారని తెలిపారు. పాలనలో సత్వరమే పౌరసేవలను అందించేందుకు వాట్సాప్ గవర్నన్సెను తీసుకువస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బగ్గు అర్చన, పార్టీ మండలాధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, సానుపల్లి కృష్ణబాబు, బైరి భాస్కరరావు, కింజరాపు రామారావు, గొలివి రామారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పరిహారం: ఆర్డీవో



ఆర్డీవోతో మాట్లాడుతున్న మూలపేట రైతులు

టెక్కలి,జనవరి 30(ఆంధ్రజ్యోతి):మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పరిధిలోని చెట్లకు సంబంధించి అర్హులైన బాధిత రైతులందరికీ పరిహారం అందజేస్తామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పరిధిలోని రైతులకు సంబంధించిన జిరాయితీ, రెవెన్యూ, పోరంపోగు పరిధిలో పడిన చెట్లకు పరిహారం అందించాలని రైతులు ఆర్డీవోను కలిసి కోరారు.తాము పెంచిన చెట్ల వల్ల ఫలసాయం పొందుతున్నామని, చెట్లు ఉన్నచోట డ్రెడ్జింగ్ పనుల వల్ల ఉప్పునీరు వస్తుండడంతో నష్టం వాటిల్లుతుండడంతో ఆదుకోవాలని రైతులు అప్పలస్వామి, గణేష్, సింహాచలం కోరారు. ఇప్పటికే రెవెన్యూ పోరంపోగులో ఉన్న చెట్టుకు రూ.1,300లు, రెవెన్యూ పరిధిలో ఉన్న చెట్టుకు రూ.2,600లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదన చేశామని, నిధులు మంజూరైతే బాధితులకు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు.

ఇంటి పన్నులు వసూలు చేయండి: డీఎల్‌పీవో

పాతపట్నం,జనవరి30(ఆంధ్రజ్యోతి):మోడల్ కోడ్ ఆఫ్‌కాండక్ట్ అమలుపై దృష్టి సారించాలని టెక్కలి డీఎల్‌పీవో డి. గోపిబాల కోరారు. గురువారం పాతపట్నంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ మార్చి ఎనిమిదో తేదీవరకూ అమలులో ఉంటుందన్నారు. శతశాతం ఇంటిపన్నుల వసూళ్లు చేయాలని, క్లాప్‌మిత్రల బకాయివేతనాలు చెల్లించాలని ఆదేశించారు.శానిటేషన్ పనులపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలలో ఎంపీడీవో చంద్రకుమారి, ఈవోపీఆర్డీ వెంకటరావు, కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎంపీడీవో

ఎల్.ఎన్.పేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం విడుదలచేసిన షెడ్యూల్ మేరకు ఈసీ ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయాల సిబ్బంది, రెవెన్యూ కార్యదర్శులు, సిబ్బందితో సమీక్షించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మునిసిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా

పలాస,జనవరి 30(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్సీఎన్నికల కోడ్‌వల్ల మునిసిపల్ బడ్జెట్ సమావేశం వాయిదాపడింది. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం కోడ్ అమల్లోకి రావడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 2025-2026 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశం జరగాల్సిఉంది.

లీజు రద్దు చేసే వరకూ పోరాటం



మాట్లాడుతున్న శిర్ల ప్రసాద్

కొత్తూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ లీజు రద్దు చేసే వరకు పోరాడుతామని ఏపీవ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ తెలిపారు. గురువారం నివగాంలో లీజు రద్దుపె నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగా కాంప్లెక్స్ ఉండేదని, డబ్బులకోసం ప్రైవేటువ్యక్తులకు అప్పగించడం సరికాదన్నారు.ఎమ్మెల్యే జోక్యం చేసుకొని లీజు రద్దుకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆలవెల్లి రాంబాబు, పూర్ణచంద్రపట్నాయక్, చిన్నారావు, ధర్మారావు, గోపాల్, ఉగాది పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కమిటీల ఏర్పాటు

నరసన్నపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. గురువారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ ధర్మాన ప్రసాదరావు, బొత్ససత్యనారాయణ వంటి బలమైన నాయకులు ఉన్న విషయాన్ని గుర్తించాలన్నారు.వైసీపీ జీరో అవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు కలలు కంటున్నారన్నారు. అనంతర వివిద విభాగాలకు చెందిన అధ్యక్షులను సన్మానించారు.

తప్పుడు వాగ్దానాలతో మోసం

పాతపట్నం, జనవరి30(ఆంధ్రజ్యోతి): తప్పుడు వాగ్దానాలతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజలకు మోసగించారనిమాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలపై చేతులెత్తేశారని ఆరోపించారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషి

● గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నివాళి

బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు కోరారు. గురువారం గాంధీ వర్ధంతి పురస్కరించుకుని జిల్లాలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, వివిధ సంఘాల, రాజకీయ పార్టీ నాయకులు, గాంధీ సేవాసమితి ప్రతినిధుల చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ దేశానికి చేసిన సేవలను , స్వాతంత్ర్యోద్యమ పోరాటం గురించి పలువురు గుర్తుచేసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



పాతపట్నం: ప్రభుత్వోన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో విద్యార్థులు



పలాస: మునిసిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది, పాలకవర్గ సభ్యులు

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై దృష్టి: ఏడీ



మాట్లాడుతున్న కొల్లి కవిత

పలాసరూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ జిల్లా అసిస్టెంట్ డైరక్టర్ కొల్లి కవిత తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంఆవరణలో ఎంపీడీవో వసంతకుమార్ ఆధ్వర్యంలో ఏఐఐ సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను పంపిణీ చేసేందుకు అర్హత పరీక్షలు నిర్వహించారు.ఈసందర్భంగా 210మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా యాదగిరి

పలాసరూరల్,జనవరి30(ఆంధ్రజ్యోతి):మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన వడ్డి యాదగిరి పలాస నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు.ఈకమిటీలో పలాస ఎమ్మెల్యే శిరీషతో పాటుకలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండర్కర్ చైర్మన్‌గా ఉంటారు. ఈ మేరకు యాదగిరి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి, మాజీ మంత్రి గౌతు శివాజీ, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు ధన్యవాదాలు తెలియజేశారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించండి

నరసన్నపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): యువకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సీఐ జె.శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక కంబకాయి జంక్షన్‌లో వాహనాలను తనిఖీచేశారు.ఈ సందర్భంగా వేగంగా వాహనాలను నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు.

●పోలాకి, జనవరి 30(ఆంధ్రజ్యోతి):పోలాకిలోని డోల రోడ్‌కూడలి వద్ద పోలీసులు ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీచేశారు. పోలాకి, పల్లిపేట, డోల, పిన్నింటిపేట కూడళ్ల నుంచి వచ్చే వాహనాలు తనిఖీచేసి సూచనలు చేశారు. హెల్మెట్ ధరించాలని సూచించారు.

త్వరలో ఇంటింటికి కొళాయిలు: డీఈ

పలాసరూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): త్వరలో ఇంటింటికి కొళాయిలను ఏర్పాటుచేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ తెలిపారు. గురువారం బ్రాహ్మణతర్లా పెద్దవీధిలో లీకవుతున్న పైపులైన్లు, సీసీ రోడ్డు పనులు, ఈదురాపల్లిలో జరుగుతున్న సీసీరోడ్ల పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలుతప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ జి.రవిబాబు, కూటమి నాయకులు వడ్డి యాదగిరి, ఆళ్ల కృష్ణారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్, తామాడ మోహనరావు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నియంత్రణ సామాజిక బాధ్యత

పాతపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధినియంత్రణకు సామాజిక బాధ్యత వహించాలని హెచ్‌ఎం ఎ.అప్పలస్వామి తెలిపారు. కోదూరు, తీమర పాఠశాలల్లో విద్యార్థులకు స్పర్శ లెప్రసి అవేర్‌నెస్ క్యాంపైన్‌ను నిర్వహించారు. కుష్ఠువ్యాధి నియంత్రణలో సామాజిక బాధ్యత వహిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అప్పలస్వామి, శంకరరావు ఉపాధ్యాయులు నారాయణరావు, పుష్పలత వెల్ఫేర్ అసిస్టెంట్ సరితకుమారి పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేక.. పిచ్చిమొక్కలు పెరిగి

● ఇదీ కిల్లోయి కాలనీలో పశువైద్య కేంద్రం వద్ద పరిస్థితి



కిల్లోయికాలనీ పశువైద్య కేంద్రం పరిసరాల్లో పిచ్చిమొక్కలు

మందస, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కిల్లోయి కాలనీలో నిర్మించిన గ్రామీణ పశువైద్య కేంద్రం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో విషసర్పాలు, కీటకీలు సంచరిస్తుండడంతో ఇక్కడకు పశువైద్యానికి వచ్చే రైతులు ఇబ్బంది పడుతున్నారు. పిచ్చిమొక్కలు బాగా పెద్దవిగా ఉండడంతో అటవీని తలపిస్తోంది. ప్రధానంగా పశువైద్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు మొక్కలు తొలగించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతు న్నారు. ఇక్కడ చుట్టుపక్కల ఉండే గిరిజన ప్రాంతాల నుంచి రైతులు గొర్రెలు, మేకలు, పశువులు ఎక్కువగా వైద్యం కోసం తీసుకొస్తుంటారు. తక్షణమే పశువైద్యకేంద్ర పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నందిగాం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపురం పంచాయతీ పాలవలసపేట ఉద్దండ భర్తుపురంలో అభయాంజనేయస్వామి మందిర ప్రారంభంతోపాటు, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్వామివారికి ఊరేగింపు, గణపతిపూజ, శనివారం కుంకు మ, సింధూర, తమల అర్చనలు, ఆదివారం ప్రతిష్ఠ జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

టెక్కలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స, అత్యవసర సహాయక చర్యలపై రెడ్‌క్రాస్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. శుక్రవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రెడ్‌క్రాస్ మేనేజర్ ఎంకే సత్యనారాయణ, జి.రమణ, వలంటీర్ రమణప్రమాదం జరిగితే క్షతగాత్రులను ఏరకంగా ఆదుకోవాలి, దగ్గర్లో ఉన్నఆసుపత్రికి ఎలా తరలించాలో వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్,ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, లూక్ పాల్ పాల్గొన్నారు.

సబ్‌జైలు పరిశీలన

నరసన్నపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును మునిసిప్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి చందక హరిప్రియ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ముద్దాయిలతో మాట్లాడి, మౌలిక వసతులపై ఆరాతీశారు. ఉచితంగా అందజేస్తున్న న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పలాసరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి):మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పలాస ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ తెలిపారు. గురువారం పలాస ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలోస్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు ప్రసన్నకుమార్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి

పలాసరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వల్ల గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని తెలుగు యువత మండలాధ్యక్షుడు కిక్కర డిల్లీరావు తెలిపారు. ఈమేరకు బొడ్డపాడులో సీసీ రోడ్డు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తామాడ త్రిలోచనరావు, మురిపింటి కుమార్‌రాజా, సారా జోగారావు పాల్గొన్నారు.

సత్తాచాటిన బాలికలు

హిరమండలం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): హిరమండలం కేజీబీవీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు శ్రీకాకుళంలోఈనెల 29న నిర్వహించిన బాలలను రక్షించండి-బాలికలను చదివించండి చాంపియన్ కార్యక్రమంలో సత్తాచాటారు. వంజరాపు శ్రావ్య 583 మార్కులతో జిల్లాలో ప్రథమ, కేర్మాన ఉమాదేవి 572 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రత్యేకాధికారి కృష్ణవేణి చెప్పారు.

సూర్యఘర్‌పై సమీక్ష

పోలాకి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ రిజిస్ట్రేషన్లపై గురువారం విద్యుత్, మండలపరిషత్‌సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో రవికుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, జేఈ రవి సూర్యఘర్ స్కీమ్ వివరాలను వివరించారు. రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని, ప్రజలకు సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలని కోరారు.

పాతపట్నంలో 'సంకల్ప్'

పాతపట్నం జనవరి30(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని కోర్టు కూడలిలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా వాహనచోదకులకు సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలను పోలీసులు వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు యువత సహకరించాలనికోరారు.

పంచధామ క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు

కోటబొమ్మాళి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చిన్నహరిశ్చంద్రపురం పంచధామ క్షేత్రంలో మహాశివరాత్రిఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయవ్యవస్థాపకులు ఉప్పాడ కనకరాజు కోరారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ లక్ష శివలింగాల ప్రతిష్ఠతోపాటు పలు దేవతా మూర్తుల విగ్రహాలు ఏర్పాటుకోసం దాతలు ఇటుక, సిమెంట్, స్టీల్ వస్తురూపంలో సహకరించాలని కోరారు.